క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



15వ డివిజన్‌లో మజ్జిగ కేంద్రం ప్రారంభించిన నాయకులు

ఏలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకుడు పేదల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ కురెళ్ల రాంప్రసాద్ అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నయ్య ఆళ్ల ప్రసాద్ జ్ఞాపకార్థం కార్పొరేటర్ తంగెళ్ల రాము ఏర్పాటుచేసిన మజ్జిగ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రాంప్రసాద్ మాట్లాడుతూ నాయకులు పేరిట ఏటా సేవా కార్యక్రమం చేపట్టడం మంచి ఆలోచనన్నారు. వేసవికాలంలో పేదలకు మంచినీరు, మజ్జిగ అందించడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రామిశెట్టి సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్ జైన్, అబ్బిరెడ్డి రంగముత్యాలు, సాయన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన వ్యక్తి

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రైల్వే స్టేషన్‌లో ట్రైన్ నెంబర్ 22880 తిరుపతి నుంచి భువనేశ్వర్ వెళ్లే భువనేశ్వరి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. అతని వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుంది. ఆచూకీ తెలిసిన వారు ఏలూరు రైల్వే ఏఎస్సై పి.సైమన్‌కు తెలియచేయగలరు. వివరాలకు సెల్ నెంబర్ 99892 19559కు సంప్రదించాలని కోరారు.

చిరస్మరణీయుడు కాటన్

దెందులూరు: ఉభయగోదావరి జిల్లాలకు సాగు, తాగునీటికి రూపకర్త కాటన్ దొర సేవలు నిరంతరం చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ దెందులూరు అధ్యక్షుడు పోకల రాంబాబు, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు అన్నారు. సోమవారం దెందులూరులో లైబ్రరీ సెంటర్ వద్ద దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో కాటన్ దొర జయంతిని నిర్వహించారు. నూకరాజు తదితరులు కాటన్ దొర సేవలను కొనియాడారు. నాయకులు సంపెంగ వేణుగోపాల్ తిలక్, గ్రామ టీడీపీ అధ్యక్షులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, దెందులూరు గ్రంథాలయ అధికారి రాజ్యలక్ష్మి, సర్పంచ్ తోట ఏసమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు.. ప్రజల బెంబేలు

- 43 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు



ఏలూరు నగరంలో నిర్మానుష్యంగా రోడ్లు



ఏలూరులో తలకు చున్నీ కట్టుకుని వెళుతున్న మహిళలు

ఏలూరు టౌన్: భానుడు భగ్గుమంటున్నాడు. ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. తీవ్రమైన వడగాలులు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మార్చిలోనే దంచికొట్టగా.. ఏప్రిల్‌లో అవికాస్తా రెట్టింపయ్యాయి. మే నెలలో సూరీడు సుర్రుమంటూ ఉగ్రరూపం దాల్చి నిప్పుల కుంపటిని తలపిస్తున్నాడు. ప్రస్తుతం 40, 41 డిగ్రీలు నమోదవుతూ ఉండగా సోమవారం ఏలూరు నగరంలో 43 డిగ్రీలు దాటేసింది. ఉదయం నుంచే సూరీడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాబోయే రోజుల్లో భానుడి సెగ రెట్టింపవుతుందని, తప్పని సరైతేనే ప్రజలు బయటకు రావాలని, ఎండల్లో ఇంటి నుంచి బయటకు రాకుంటేనే మంచిదని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

నిప్పుల కొలిమిలా..

ఏలూరు నగరం, పరిసర ప్రాంతాలు భానుడి ధాటికి నిప్పుల కొలిమిలా మారాయి. గతంలో లేనివిధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతన్నాయి. గత నెలలో ఏలూరులో కనిష్ట ఉష్ణోగ్రత 22 డిగ్రీలు, గరిష్టంగా 36 డిగ్రీల వరకు నమోదయ్యాయి. తాజాగా ఏలూరు నగరంలో మూడు రోజులుగా 40 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావటం విశేషం. సోమవారం 43 డిగ్రీలు ఉంటే, ఆదివారం 41 డిగ్రీలు, శనివారం 40 డిగ్రీల వరకు నమోదయ్యాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

తీవ్ర అవస్థలు

నివాస గృహాలు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో నిత్యం ఏసీలు, కూలర్లు పనిచేస్తూనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏసీలను 16, 18 డిగ్రీల్లో ఉంచినా వాతావరణంలో పెద్దగా మార్పు ఉండటంలేదు. చల్లబడేందుకు రెండు, మూడు గంటలు పడుతుందంటే భానుడి వేడి ఏస్థాయిలో ఉందో అర్థం అవుతుంది. ఉద్యోగాలకు వెళ్లేవారు, వ్యాపారులు, వ్యక్తిగత పనులపై ప్రయాణాలు చేసే వారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎండలో వెళ్లొద్దు



వేసవి ఎండలు మరింత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండాలి. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకెళ్లరాదు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు జాగ్రత్తలు పాటించాలి. చల్లటి వాతావరణంలో ఉండేలా చూసుకోవాలి. తాగునీరు ఎక్కువగా తీసుకోవాలి, లేకుంటే డీహైడ్రేషన్ వచ్చే ప్రమాదం ఉంది. ఏలూరు నగరంలోనూ ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో ప్రజలకు చల్లటి మజ్జిగ, తాగునీటి పంపిణీకి చలివేంద్రాలు ఏర్పాటు చేశాం. – డాక్టర్ దిరిశాల వర ప్రసాదరావు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, ఏలూరు

జాగ్రత్తలు తప్పనిసరి



ఉద్యోగాలు, వ్యక్తిగత అవసరాలు, పనులు, వ్యాపారాలు చేసుకునేవారు, ప్రజలు వేసవిలో జాగ్రత్తలు పాటించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు, ముఖానికి మాస్క్ వంటివి, సన్ గ్లాస్, కాటన్ వస్త్రాలు ధరించటం మంచిది. నిత్యం చల్లటి తాగునీరు, ఇతర పానీయాలు, జూస్, చెరుకు రసం వంటివి తీసుకుంటూ ఉండాలి. వదులుగా ఉండే వస్త్రాలు ధరించాలి. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం ఏడు నుంచి ఎనిమిది లీటర్ల నీరు తీసుకుంటే వడదెబ్బబారి నుంచి తప్పించుకోవచ్చు. – డాక్టర్ కేవీ విజయకుమార్, సూపరింటెండెంట్, సర్వజన ఆసుపత్రి, ఏలూరు

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ఏలూరు రూరల్: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో కోరారు. ఏఐటీయూసీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇసుక, ఐరన్, సిమెంట్ తదితర భవన నిర్మాణ సామగ్రి ధరలు పెరిగి కార్మికులకు పనులు లేక అల్లాడుతున్నారని వాపోయారు. జిల్లా నాయకుడు చేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 1996లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బోర్డులు పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం నాయకులు పుప్పాల కన్నబాబు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, కంకిపాటి బుచ్చిబాబు, తోరాపాటి బాబు తదితరులు జిల్లా కలెక్టర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి కూలీలకు రూ. 600 వేతనం ఇవ్వాలి

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజు రూ. 600 వేతనం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.రామకృష్ణ కోరారు. సోమవారం మండలంలోని దెందులూరులో అప్పారావు చెరువు వద్ద ఉపాధి హామీ పనుల వద్ద కూలీలను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీల జీవన విధానం మరింత మెరుగుపర్చేందుకు వారికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని అన్నారు.

పెన్షనర్ల సమస్యలపై ఎంపీ శ్రీధర్‌కు వినతి

దెందులూరు: తమ జీవన విధానానికి ఆటంకం లేకుండా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను బ్యాంకు పెన్షనర్లు కోరారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఎంపీని బ్యాంక్ పెన్షనర్లు కలిసి సమస్యలు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. బ్యాంకు పెన్షనర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

కంప్యూటర్ సైన్స్‌లో చందుకు డాక్టరేట్

దెందులూరు: తెలుగు తేజం యలమర్తి చందు అమెరికాలో తన ప్రతిభాపాటవాలను చాటాడు. దెందులూరు మండలం పెరుగ్గూడెంకు చెందిన పాటెమ్మ తల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, హేమలత కుమారుడు చందు అమెరికాలో మాస్టర్ ఇన్ కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పొందారు. పెరుగ్గూడెంకు చెందిన విద్యార్థి అమెరికాలో సత్తాచాటి టెక్సాస్ రాష్ట్రంలో యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ నుంచి మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పొందడంపై గ్రామస్తులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్రం విధానాలతో ఉపాధి పథకం నిర్వీర్యం



ఉపాధి పథకంపై కూలీలతో చర్చిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు రూరల్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి పల్లెం కిషోర్ ఆరోపించారు. సోమవారం ఏలూరు మండలం పాలగూడెంలో ఉపాధి హామీ కూలీలు చేస్తోన్న పనులను సీపీఎం నాయకులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ వామపక్ష పార్టీల కృషితో అప్పటి ప్రభుత్వం 2005లో ప్రారంభించిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లకు పైగా నిధులు వెచ్చించిందని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో బడ్జెట్ తగ్గించుకుంటూ పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజుకు రూ.275 కూలి రేటు ఉన్నప్పటికీ రూజ250 మాత్రమే చెల్లిస్తోందన్నారు. గతంలో నియమించిన మేట్ల స్థానే ఇప్పుడు సైట్ సూపర్ వైజర్లను నియమించి పని భారం పెంచడం అన్యాయమన్నారు. కేంద్రం ప్రభుత్వం తక్షణం పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కూలీలను కలిసిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు పీవీ రామకృష్ణ, జె.గోపీ తదితరులు ఉన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో డ్యాన్స్ శిక్షణ



ఫొటోఫ్రేమ్‌లు తయారు చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు పాశ్చాత్య నృత్యంలో శిక్షణ ఇచ్చారు. నగరానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ కె.ఫణికాంత్ విద్యార్థులకు నృత్యంలోని మెళకువలు నేర్పారు. అనంతరం డి.శ్రీవల్లి విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌లో భాగంగా పేపర్లు, అట్టముక్కలతో ఫొటో ఫ్రేములు తయారీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉప్పాల శ్రీదేవి ఆర్‌కే నారాయణ్ రచించిన మాల్గుడి కథలు వినిపించి కథల్లోని నీతిని వివరించారు. అనంతరం డ్రాయింగ్ టీచర్ ఎంఎస్ గౌస్ పాషా చిత్రలేఖనం కోసం పెన్సిల్‌ను ఎలా ఉపయోగించాలో తెలుపుతూ విద్యార్థులకు చిత్రలేఖనంలో మెళకువలను వివరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్, ఎండీ అస్లాం పాషా, బీపీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

డీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న డీటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని ఆ సంఘ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి, ఎన్నికల అధికారి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పి.శేషబ్రహ్మం ఏలూరులో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపూడిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షునిగా కె.కాంతారావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఆదినారాయణ మరోసారి ఎన్నికైనట్టు తెలిపారు. సంఘ ఉపాధ్యక్షులుగా ఎస్‌పీవీ సుబ్రహ్మణ్యం, వైవీ రామారావు, కార్యదర్శులుగా పీఆర్ నాగరాజు, ఎస్‌వీ సుబ్బారావు, టి.డేవిడ్, రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.సురేష్ కుమార్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేశారు.

బాధితులకు సత్వర న్యాయం



ఎస్పీ మేరి ప్రశాంతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు



ఎస్పీ మేరి ప్రశాంతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పోలవరం డీఎస్పీ శ్రీనివాసులు

- ఎస్పీ మేరి ప్రశాంతి

ఏలూరు టౌన్: జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ డి.మేరి ప్రశాంతి అన్నారు. ఏలూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఈ.శ్రీనివాసులు, పోలవరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎ.శ్రీనివాసులు సోమవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరి ప్రశాంతి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ఖచ్చితంగా వ్యవహరించాలని, నిస్పక్షపాతమైన వైఖరి ప్రదర్శించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలు శాంతిభద్రతలతో జీవించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై నేరాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. సబ్ డివిజన్ల పరిధిలో రాత్రిగస్తీని మరింత పెంచుతూ నేరాలను అదుపు చేయాలని ఆదేశించారు. వేసవిలో ఇళ్లల్లో దొంగతనాలకు నివారణకు ప్రజలకు ఎల్‌హెచ్ ఎంఎస్‌పై అవగాహన కల్పించాలన్నారు. మహిళా రక్షణకు ఉపయోగపడేలా దిశా యాప్‌ను ప్రతి ఒక్క మహిళ, యువతి సెల్‌ఫోన్లల్లో డౌన్ లోడ్ చేయించాలని సూచించారు.

గ్రామీణ పేదల కోసమే ఫ్యామిలీ డాక్టర్

గణపవరం : ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను గ్రామీణ పేదలు వినియోగించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. సోమవారం గణపవరం మండలం చిలకంపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, 104 వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 10 మంది గర్భిణులకు, ముగ్గురు బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉంగుటూరు : గొల్లగూడెం గ్రామంలో నారాయణపురం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ డైరెక్టర్ దాసరి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వెలిశెట్టి పాపారావు బాజ్జి మాట్లాడుతూ మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1962 ప్రభుత్వం మద్దతు ధర అందజేస్తుందని, తప్పనిసరిగా రైతులు ఆర్‌బీకేల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	72
పచ్చిమిర్చి	44-48	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	40
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	40	అల్లం	232
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32	పాలకూర	08-12
దొండకాయలు	20	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	14	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	58
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	05
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

అర్హులందరికీ నవరత్న పథకాలు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- ఏపూరులో గడపగడపకు మన ప్రభుత్వం



పెదపాడు మండలంలోని ఏపూరులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: అర్హులందరికీ నవరత్న పథకాలు అందించేందుకు అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచించారు. మండలస్థాయి అధికారులు గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. పెదపాడు మండలంలోని ఏపూరులో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు కావాలని, డ్రైనేజీలు నిర్మించాలని, ఇళ్ల రుణాలు అందించాలని కొంతమంది అడగటంతో వెంటనే సంబంధిత సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల రుణాలు కావాల్సిన వారి పేర్లు నమోదు చేసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యలను నమోదు చేసుకుని గ్రామస్థాయి, మండల స్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆపై స్థాయి సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో మంచినీరు, విద్యుత్ సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు సలహాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సంబంగి శ్రావణ్ కుమార్, వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, అప్పనవీడు ఎంపీటీసీలు బుద్దే రామసీత, వీరంకి బుజ్జి, సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమల్లేశ్వరరావు బెజవాడ శిరీషా శేఖర్, స్థానిక బెజవాడ నర్సింహారావు, బెజవాడ సత్యనారాయణ, చోడగిరి బిక్షాలు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో గాలాయగూడెంలో..

దెందులూరు: గాలాయగూడెంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం సచివాలయంలో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథు లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన మాట్లాడా రు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తోటఅచ్చియ్య, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు అంబటి లక్ష్మణరావు, పెద్దిశెట్టి బసవ య్య, పర్వతనేని సుధీర్, వార్డు మెంబర్లు ఉన్నారు.

నలుగురికి గాయాలు

ఉంగుటూరు : జాతీయ రహదారిపై చేబ్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం పూళ్ల నుంచి ఉండి మండలం ఉప్పునూరు వెళుతున్న చిన్న కారు చేబ్రోలు ఊరి చివర నిలుపుదల చేశారు. ఈ కారును వెనుక నుంచి మరో కారు ఢీకొంది. ఆగి ఉన్న కారులోని యర్రా కేశవరావు (50), దృశ్యంత్ (5)కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో కారులోని పి.జగన్‌మోహన్, లక్ష్మీప్రసన్నలను అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.